క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కొహెడ ఫీడర్ పరిధిలోని శాంతి నగర్, బ్యాంక్ కాలనీ, సదాశివకాలనీ, సాయి నగర్, పెద్దఅంబర్‌పేట ఎక్స్‌రోడ్డు, పరిసర కాలనీల్లో ఈ అంతరాయం ఉంటుందన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని ప్రణాళికాబద్ధగా అభివృద్ధి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో బుధవారం ఆయన కాలనీ వాసులతో కలిసి పర్యటించి కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రణధీర్, కాలనీ అధ్యక్షుడు రాముగౌడ్, నాయకులు శేఖర్, జ్ఞానేశ్వర్, ఉపేందర్, వెంకట్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీటీ గోపాల్‌రావుకు పరామర్శ

బడంగ్‌పేట్: ఆలిండియా డిఫెన్స్ ఉద్యోగుల నాయకుడు కామ్రేడ్ జీటీ.గోపాల్‌రావు ఇటీవల క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనకు శస్త్ర చికిత్స చేసి 40శాతం నాలికను తొలగించారు. విషయం తెలుసుకున్న కామ్రేడ్లు బడంగ్‌పేటలోని గోపాల్‌రావు ఇంటికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా కామ్రేడ్లు మాట్లాడుతూ.. ఉద్యోగంలో ఉన్నప్పుడు తర్వాత కాలంలోనూ పూర్తిగా డిఫెన్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేసిన జీటీ గోపాల్‌రావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సీపీఎం రాష్ట్ర సెక్రెటేరియట్ మెంబర్ డీజీ నరసింహారావు, రాష్ట్ర నాయకులు ప్రసాద్, సీపీఎం నాయకులు కిషోర్ తదితరులు ఉన్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

కాచిగూడ: పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాధినిరోదక టీకాలు తప్పనిసరిగా వేయించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్, ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వ్యాధి నిరోదక టీకాలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు, రోగనిరోధక శక్తి పెరిగేందుకు టీకాలు వేయించాలని సూచించారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్ పద్మజ, నర్సుబాయి, ఇందిర, అనురాధ, సబిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మధుసూదన్ గుప్తా


నియామకపత్రం అందుకుంటున్న నీల మధుసూదన్ గుప్తా

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నీల మధుసూదన్ గుప్తా నియమితులయ్యారు. బుధవారం హస్తినాపురంలోని పిండి నారాయణ రెడ్డి కాలనీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బిజ్జాల వేణు గుప్తా, కోశాధికారిగా బండారు సుధాకర్‌గుప్తా, ఉపాధ్యక్షుడిగా శవ్వ యాదగిరి గుప్తా, సంయుక్త కార్యదర్శిగా ఎర్రం భాస్కర్‌గుప్తా నియమితులయ్యారు. ఆర్య వైశ్యుల సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు నీల మధుసూదన్ గుప్తా అన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 19, వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి 42, కాకర 47, బీర 40, క్యాబేజీ 14, ఫ్రెంచిబీన్స్ 85, క్యారెట్ 38, దొండ 19–23, చిక్కుడు 55, గోకర 45, బీట్‌రూట్ 20, క్యాప్సికం 50, ఆలు 20, దోస 13, సొర 7, పొట్ల 13, ఉల్లి 14 చామగడ్డ 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.


కోమటికుంట చెరువులోకి వరదలా వస్తున్న మురుగు


కుంటను తలపిస్తున్న మురుగు

నత్తనడకన 'సుందరీకరణ'

కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన కోమటికుంట సుందరీకరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పనులు చేపట్టడంలో అలసత్వం వహించడంతో చెరువు ప్రాంతమంతా కళావిహీనంగా తయారైంది. డ్రైనేజీల నుంచి వచ్చే మురుగు కుంటగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- రోడ్లపై పారుతున్న మురుగు
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందుకు నిధులు సైతం మంజూరయ్యాయి. పనులు చురుగ్గా ప్రారంభించినా ఒక్కసారిగా నిలిచిపోయాయి. గతంలో మురుగు చెరువులోకి వెళ్లేలా పైప్‌లైన్లు వేశారు. సుందరీకరణ పనుల్లో భాగంగా కోమటికుంట చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కట్టను నిర్మిస్తున్నారు. దీంతో మురుగు వెళ్లే దారిలేక కుంటగా తయారైంది. అల్మాస్‌గూడలో కోమటికుంట చెరువు బ్యూటిఫికేషన్ చేసేందుకు అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. దీంతో సుమారు రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు నత్తనడకన చేపడుతున్నాడు. అల్మాస్‌గూడ పంచాయతీ, నగర పంచాయతీగా ఉన్న సమయంలో 60గజాల ఇళ్లు, వైఎస్ నగర్ ఫేస్–1,2,3, జయశంకర్ నగర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, విశాఖనగర్ కాలనీ, శ్రీశ్రీ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ, ఓ ఫంక్షన్‌హాల్‌కు సంబంధించిన మురుగుతో పాటుగా.. మరో 15 కాలనీలకు చెందిన మురుగు చెరువులోకి వదిలేందుకు పైప్‌లైన్లు వేశారు. జనాభా పెరగడంతో మురుగు ఉధృతి పెరిగింది. సుందరీకరణ పనుల్లో భాగంగా చేపట్టిన వాకింగ్ ట్రాక్ నిర్మిస్తుండడంతో మురుగు వెళ్లే దారిలేక అల్మాస్‌గూడ, రాజీవ్ గృహకల్ప మార్గంలో మురుగంతా ఓ కుంటలా తయారైంది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. చుట్టు పక్కల ఉన్న వారు రాత్రిళ్లు నిద్రపోలేకపోతున్నామని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం



చెరువుల అభివృద్ధికి సుందరీకరణ పనులు చేపట్టడం అందరికీ ఆమోదమే. కానీ డ్రైనేజీ వెళ్లే మార్గం లేకుండా అభివృద్ధి చేయడం సరికాదు. డ్రైనేజీ అంతా ఒక చోట చేరి కుంటలా తయారైంది. దీని నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు మురుగు వెళ్లే మార్గం చూపాలి.

– బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, అల్మాస్‌గూడ

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం


ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోలు బండ్లగూడలోని వీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన ఫుట్‌బాల్ ఇంటర్నల్ లీగ్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రభుత్వం స్టేడియాలు నిర్మిస్తున్నదని, క్రీడాకారులు తమ ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చూపించి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీఈఓ హెల్త్ సర్వీసెస్ ఎండీ రాంరెడ్డి, కోచ్ సుదీప్, నరేష్‌కుమార్, రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ విజయపురి కాలనీ ఫేజ్–2లోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ 21 వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కార్పొరేటర్ లచ్చిరెడ్డి కోరుకున్నారు. అనంతరం ఆయన ఆలయ అర్చకుల గృహనిర్మాణం కోసం రూ.25 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సోమిశెట్టి మోహన్, నాయకులు విష్ణువర్ధన్‌రావు, సాయి రాం, పర్వతరెడ్డి, గోపాల్‌రెడ్డి, కనకరాజు, ప్రసాద్, రమణ, శైలేష్, ఆంజనేయరావు తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల మద్యం పట్టివేత

మలక్‌పేట: ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం... ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు, డిస్ట్రిక్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ పవన్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం మలక్‌పేట ఎక్సైజ్ సిబ్బందితో కలిసి మిథానీ బస్ డిపో ఎదురుగా రూట్ వాచ్ చేపట్టారు. ఈ క్రమంలో బస్టాప్‌లో జార్ఖండ్‌కు చెందిన రాజారామ్‌సింగ్ అనే వ్యక్తి పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు అతడి వద్ద ఉన్న ప్లాస్టిక్ సంచిని పరిశీలించగా అందులో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలు కనిపించాయి. సంచిలో రెండు కార్టన్లు ఉండగా.. ఒక దానిలో 12 బ్లాక్ లేబుల్ విస్కీ సీసాలు, 5 బ్లాక్ లేబుల్ విస్కీ సీసాలు, ఒక సీసా ఓల్డ్‌మంక్ రమ్, ఒక కాబో వైట్ రమ్ సీసా.. మొత్తం 19 ఫుల్ బాటిల్ మద్యం దొరికింది. మద్యం సీసాలపై ధరల స్టిక్కర్, ఏ రాష్ట్రానికి చెందినది తెలిపే లేబుళ్లు లేవని తెలిపారు. కేసు నమోదు చేసి అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రూట్ వాచ్‌లో ఎక్సైజ్ అధికారులు శివజ్యోతి, శివచరణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

25 వేలమంది నిరుద్యోగులకు శిక్షణ


వేణుగోపాల్‌రావు, సెట్విన్ ఎండీ

యాకుత్‌పురా: 2023–24వ విద్యా సంవత్సరంలో 25 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్ రావు తెలిపారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ... గత ఏడాది సంస్థ కేంద్రాలతో పాటు ఫ్రాంచైజీలలో మొత్తం 16,490 మంది విద్యార్థులు శిక్షణ పొందారన్నారు. నగరం, జిల్లాలోని 24 శిక్షణ కేంద్రాలతో పాటు ఆన్‌లైన్‌లో సైతం 57 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న 45 కోర్సులతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. నామమాత్రపు రుసుముతో సెట్విన్ అందిస్తున్న కోర్సుల్లో ఆసక్తి గల అభ్యర్థులు మోతీగల్లీ, ముషీరాబాద్, తార్నాక, యూసూఫ్‌గూడ, ఈస్ట్ మారేడ్‌పల్లి, ఏసీ గార్డ్స్, చైతన్యపురి, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, రియాసత్‌నగర్, మీరాలం ట్యాంక్, ఈదీబజార్, పురానీహవేలి, నెరేడ్‌మెట్, విద్యానగర్, మలక్‌పేట్, రసూల్‌పురా, ఎస్‌బీటీ నగర్, ఎర్రగడ్డ, అంబర్‌నగర్, సీతఫల్‌మండి శిక్షణా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

గురుకుల జూనియర్ లెక్చరర్ల దరఖాస్తు గడువు పెంచాలి

గౌలిపురా: తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల జూనియర్ కాలేజీల్లో కొంత కాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తూ చివరి తేదీ 17 మే 2023 విధించిన గడువును పెంచాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.చంద్రమోహన్ గౌడ్ అన్నారు. సాంకేతిక కారణాలతో గత మూడు రోజుల నుంచి సర్వర్ పని చేయకపోవడంతో నిరుద్యోగ జూనియర్ లెక్చరర్స్ దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మరో మూడు రోజుల పాటు దరఖాస్తుల గడువును పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మారిన పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు


ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయం

నాగోలు: ప్రభుత్వం పోలీస్ శాఖలో ఉన్న అన్ని విభాగాల ఫోన్ నంబర్లను మార్చింది. ఇందులో భాగంగా ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని వివిధ విభాగాల అధికారుల నంబర్లు కూడా మారాయి. కొత్త నంబర్లు ఇలా ఉన్నాయి.

ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, 8712662003
ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి 8712662029
ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి 8712662304
క్రైమ్ సీఐ ఉపేందర్‌రావు 8712662311
పెట్రోల్ వాహనాలు 8712662652, 8712662353, 8712662354
వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి 8712662028
వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి 87126 62300
డీఐ వెంకట్ 8712662274,
పెట్రోల్ వాహనాలు 8712662638, 8712662639, 8712662300
చైతన్యపురి సీఐ మధుసూదన్ 8712662305,
పెట్రోల్ వాహనాలు 8712662359, 8712662631,
సరూర్‌నగర్ సీఐ జానకిరెడ్డి 8712662307,
డీఐ రామాంజనేయులు 8712662336,
పెట్రోల్ వాహనాలు 8712662356, 8712662357,
హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు 8712662301,
డీఐ నిరంజన్ 8712662282,
పెట్రోలు వాహనాలు 8712662644, 8712662645,
సరూర్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల 8712662306
రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ 8712662010
ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ హరికృష్ణ 8712662034
ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు 8712662446
వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ బాల్ చౌహాన్ 8712662455
ట్రాఫిక్ ఈ చాలన్– సీఐ ప్రదీప్‌బాబు 8712662458.
రాచకొండ సైబర్ క్రైమ్ డీసీపీ అనురాధ 8712662008
రాచకొండ సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశం 8712662039
ఎస్ఓటీ డీసీపీ మురళీధర్ 8712662015
డీసీపీ క్రైమ్ మధుకర్ స్వామి 8712662011,
డీసీపీ క్రైమ్ శ్రీనివాస్ 8712662017
షీటీమ్ డీసీపీ శ్రీబాల 8712662012
షీటీమ్ ఏసీపీ వెంకట్‌రెడ్డి 8712662040
షీటీమ్ సీఐ కరుణాకర్‌రెడ్డి 8712662597
షీటీమ్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ 8712662602
షీటీమ్ వనస్థలిపురం ఇన్‌చార్జ్ 8712662604
రాచకొండ కంట్రోల్ రూమ్.. 8712662666, 8712662667
వాట్సాప్ ఫిర్యాదుల కోసం 8712662111,
సైబర్ క్రైమ్ 1930

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


నాలా పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, డీఈఈ ప్రదీప్

మలక్‌పేట: డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం శాలివాహననగర్, బడాబజార్ ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న నాలా నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో నాలా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నాణ్యతలో ఎక్కడా తేడా లేకుండా చూడాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈఈ ప్రదీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, దినేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దానగుణం కలిగి ఉండాలి



పారిశుద్ధ్య కార్మికులతో ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థ సభ్యులు

లింగోజిగూడ: ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ గివింగ్ డే సందర్భంగా బుధవారం లింగోజిగూడ డివిజన్ వార్డు కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు జ్ఞాపికలు అందజేయడంతో పాటు ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థ జంట నగరాల కన్వీనర్ సిద్దుల మధు, ఎల్‌బీనగర్ కన్వీనర్ ఉప్పల శ్రవణ్‌కుమార్ గుప్తాలు మాట్లాడుతూ, అందరిలో సంతోషాన్ని పెంపొందించడంతో పాటు శాంతిని నెలకొల్పడం తమ సంస్థ ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ దానగుణం, దయాగుణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వర ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది శంకర్, ముఖేష్, వినయ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలి


మాధవ్‌నగర్‌లోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: రహదారులపై మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. బుధవారం కార్పొరేటర్ వాటర్‌వర్క్స్, ట్రాన్స్‌కో అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని మాధవనగర్, వెంకటాద్రి కాలనీల్లో పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగా తెలుసుకున్నారు. మాధవనగర్‌లో మురుగు సమస్య పరిష్కరించేలా నూతన సీవరేజ్ పైప్‌లైన్లు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా వెంకటాద్రినగర్ కాలనీలో ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని అక్కడి నుంచి వేరే చోటికి తరలించాలని ట్రాన్స్‌కో సిబ్బందికి ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్, జహంగీర్, వాటర్‌వర్క్స్ ఏఈ అల్తాఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ యాసీన్ పాల్గొన్నారు.

'ఖేలో భారత్' క్రికెట్ ఫైనల్ విజేత లింగాల టీం


క్రికెట్ ఆడుతున్న బండి సంజయ్, లింగాల హరిగౌడ్

సైదాబాద్: ఖేలో భారత్.. జీతో భాగ్యనగర్ పేరిట హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న పోటీల్లో క్రికెట్ విభాగంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ టీం విజయం సాధించింది. నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన పోటీలకు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కొంత సేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఫైనల్ మ్యాచ్‌లో లింగాల హరిగౌడ్ టీం, ఇసామియా బజార్ టీంలు పోటీపడగా.. లింగాల టీంను విజయం వరించింది. పోటీల్లో పాల్గొన్న ఇరు జట్లను బండి సంజయ్, లింగాల హరిగౌడ్ అభినందించారు.

21న మణిపూర్ క్రైస్తవులకు సంఘీభావ ప్రార్థనలు



మాట్లాడుతున్న ఏఐసిఎఫ్ కో– ఆర్డినేటర్ ఏకే గిడియోను బాబు

కాచిగూడ: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ.. ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) ఆధ్వర్యంలో మణిపూర్ క్రైస్తవులకు సంఘీభావంగా శాంతి ప్రార్థలను నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర కో– ఆర్డినేటర్ ఏకే గిడియోను బాబు ప్రకటించారు. బుధవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐసీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ అబ్రహంతో కలిసి ఆయన మాట్లాడారు. మే 21న ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించే శాంతి ప్రార్థనల్లో వందలాది మంది క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లౌకిక, ప్రజాస్వామిక, అభ్యుదయవాదులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు

చిలుకానగర్ డివిజన్‌లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే


చిలుకానగర్‌లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: రూ.80 లక్షల వ్యయంతో నిర్వహించే పలు అభివృద్ధి పనులకు బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డ నార్త్, ప్రశాంత్‌నగర్, సాయిరాంనగర్, బ్రహ్మంగారి దేవాలయం, ప్రధాన రహదారి ప్రాంతాల్లో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే పబ్లిక్ ఇంటరాక్షన్ ద్వారా ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీ అరుణ కుమారి, ఈఈ నాగేందర్, ఉప్పల్ సీఐ గోవింద్‌రెడ్డి, డీఈ చందన, జలమండలి అధికారి సత్యనారాయణ, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధుపై అసత్య ప్రచారాలు

దళిత బంధుపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హితవు పలికారు. మొదటి దఫాగా 100 మందికి దళిత బంధు అందజేసినట్లు తెలిపారు. మరో 1,100 మందికి అందజేయనున్నట్లు తెలిపారు

బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవానికి తరలిరండి



గౌతంనగర్: ఈ నెల 31వ తేదీన గోపన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు అన్నారు. బుధవారం గౌతంనగర్‌లోని బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా భవనం ప్రారంభోత్సవం ఉందన్నారు. బ్రాహ్మణులు వేలాదిగా తరలి రావాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘు కిరణాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేశ్వరశర్మ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరశర్మ, ఉపాధ్యక్షులు మధుసూదనాచార్యులు, సీతారామశాస్త్రీ, కేశవాచార్యులు, గ్రేటర్ కన్వీనర్ సుధాకర్‌రావు, మల్కాజిగిరి సంఘం అధ్యక్షులు పవన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.